ఏదేని జిల్లాకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి

కాంగ్రెస్ సీనియర్ నేత దేప భాస్కర్‌రెడ్డి


టెలిఫోన్ కాలనీ చౌరస్తాలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: 1969లో తెలంగాణ కోసం మంత్రి పదవి వదులుకొని స్వరాష్ట్రం కోసం పరితపించిన తొలితరం ఉద్యమకారుడు, న్యాయవాది, రాజకీయాలకు వన్నెతెచ్చిన మహానుభావుడు స్వర్గీయ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం శ్రీ రామకృష్ణాపురం డివిజన్ టెలిఫోన్ కాలనీ చౌరస్తా లో స్వాతంత్ర సమరయోధుడు మాజీ మంత్రివర్యులు, స్వర్గీయ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109 వ జయంతి వేడుకలు రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ సభ్యులు, నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి పాల్గొని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణలో ఏదేనీ ఒక జిల్లాకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, రంగారెడ్డి జిల్లా చేనేత సెల్ అధ్యక్షుడు మసన రవి కుమార్, రాష్ట్ర నాయకులు తల్లాటి రమేష్ నేత, ధనరాజ్ గౌడ్, శివ, వెంకటేశ్వర్లు గుప్తా, భూపాల్ రెడ్డి, యాదవ రెడ్డి,బొడ్డుపల్లి మహేందర్, జెల్ల జగన్నాధం, జెల్ల సూర్యకాంతం, జెల్ల నరసింహా, దుర్గా ప్రసాద్, కళ్యాణ్, పెద్దవూర సైదులు, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలు క్లీన్‌గా ఉండేలా చూడాలి

డీసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్య


చెత్త రిక్షాలను అందజేస్తున్న యాదయ్య తదితరులు

నాగోలు: కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రతిరోజూ కాలనీలు క్లీన్ ఉండేలా చూడాలని జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని నూతనంగా జీహెచ్ఎంసీ నుంచి వచ్చిన చెత్త సేకరణ సైకిల్ బండ్లను డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్యతో కలిసి నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పారిశుద్ధ్య కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేపటి నుంచి ప్రతి కాలనీలో రోడ్లపైన ఎక్కడ కూడా చెత్త ఉండకుండా చూడాలని పారిశుద్ధ్య కార్మికులకు, ఎస్ఎఫ్ఏలకు హెచ్చరించారు. ఎస్ఎఫ్ఏ సిబ్బందికి ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఉన్న నా దృష్టికి తీసుకుని రావాలి, వాటిని పరిష్కరించే దిశగా నేను కృషి చేస్తాను అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈ నీలిమ, జవాన్ లక్ష్మయ్య, ఎస్ఎఫ్ఏ శ్రీనివాస చారి, వెంకటస్వామి, రవి, తస్వీర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగి ఒక్క మొక్కను తప్పనిసరిగా నాటాలి

జీఎస్ఐ ఏడీజీ సూరజ్ దోమజీ పటభజే


జీఎస్ఐలో మొక్కలు నాటుతున్న ఏడీజీ సూరజ్ దోమజీ పటభజే, తదితరులు

మన్సూరాబాద్: ప్రతి ఉద్యోగికి ఒక్క మొక్కను తప్పనిసరిగా నాటి, దాన్ని పరిరక్షించాలని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) అడిషినల్ డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) సూరజ్ దోమజీ పటభజే అన్నారు. స్వచ్ఛత హే సేవా -2024 కార్యక్రమంలో బాగంగా జీఎస్ఐ ప్రాంగణంలోని యూనిటీ పార్కు వద్ద శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ హే సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్ ఎస్. శంకరయ్య, హర్మోహన్ మిషరా, మధిర సత్యనారాయణ, తారాకేశ్వరరావు, వివిఎస్ శర్మ, దివాకర్‌రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

29న ప్రొస్టేట్ కేన్సర్‌పై అవగాహన వాక్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్లు

మలక్‌పేట: ప్రతి ఏడుగురు పురుషుల్లో ఒకరికి వచ్చే అవకాశం ఉన్న ప్రొస్టేట్ కేన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించుకోవాలని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) దిల్‌సుఖ్‌నగర్ ఫెసిలిటీ డైరెక్టర్ సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ శాఖలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ నెల 29 తేదీన నిర్వహించనున్న 'ప్రొస్టేట్ కేన్సర్‌పై అవగాహన నడక'కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ఊపిరితిత్తుల కేన్సర్ తర్వాత అత్యంత ఎక్కువగా వచ్చేది ప్రొస్టేట్ కేన్సరే అని తెలిపారు. ఆదివారం ఉదయం 6.30 గంటకు అవగాహన నడక ఆస్పత్రి నుంచి ప్రారంభమవుతుందని, గతంలో చికిత్స చేయించుకున్న రోగులు, వైద్యులు, సిబ్బంది నడకలో పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సీనియర్ యురాలజిస్ట్ డాక్టర్ సుభాష్‌చంద్రబోస్, మహిళా యురాలజిస్టు డాక్టర్ దీప్తి, నెఫ్రాలజిస్టు డాక్టర్ వలీ, ఎనస్థీషియన్లు స్నిగ్ధ, రామకృష్ణ, రఘునాథ్, సల్మాన్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ


విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న జ్ఞానకుమార్

నాగోలు: తమ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు ఎంతో సహాయ పడతామని కొమర్రాజు ఫౌండేషన్ చైర్మన్ జ్ఞానకుమార్ అన్నారు. కొమర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తపేట డివిజన్‌లోని మోహన్‌నగర్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం ఉచితంగా నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా జ్ఞానకుమార్ మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు తెలుగు పద్యాలు నేర్పించడం, తెలుగు భాషాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నోట్‌బుక్స్‌తో పాటు భాగవత పద్యాలు నేర్పించే అవకాశం దొరికిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం తరగతులు కూడా ఉచితంగా ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా రిటైర్డ్ అధికారి రామారావు మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తే మానసికంగా ఎంతో చెప్పలేని ఆనందాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయన్న, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించాలి


విజేతలతో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, డీప్యూటీ ఈఓ రాధాకృష్ణ

మలక్‌పేట: చదువుతో పాటు పిల్లలకు ఆసక్తి ఉన్న క్రీడల్లో తగిన ప్రోత్సాహం అందించాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. హైద్రాబాద్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సైదాబాద్ జోనల్ లెవల్ అండర్ 14, 17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో ఇంటర్ స్కూల్స్ టోర్నమెంట్ నిర్వహించారు. స్వామి వివేకానంద హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరైన ఆమె పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆటలు దేహ దారుఢ్యంతో పాటు మానసికోల్లాసాన్ని ఇస్తాయన్నారు. పిల్లలను ఆటపాటల్లో భాగస్వాములు చేయాలని సూచించారు. సైదాబాద్ మండల డిప్యూటీ ఈఓ తిరునగరి రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓం హరికృష్ణ, పూర్వ ఆర్గనైజింగ్ సెక్రటరీ సునిల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చైతన్యపురిలో రెండో రోజూ ఉద్రిక్తత


రోడ్డుపై బైటాయించి ధర్నా చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి


చైతన్యపురిలో ఓ ఇంటి గోడపై రెడ్ మార్క్ వేస్తున్న సిబ్బంది

- కాలనీలలో పర్యటించిన ఎంపీ ఈటల రాజేందర్, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి
- ఎండలో నడిరోడ్డుపై బైటాయించి ధర్నా
- తమ ఇళ్లను కాపాడాలని పేదల వేడుకోలు
- కిరోసిన్ పోసుకున్న బాధితుడు
- నిరసనల మధ్యనే మార్కింగ్ చేసిన రెవెన్యూ అధికారులు
- భారీగా పోలీసుల మోహరింపు


మహిళను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ వినాయక్‌నగర్, న్యూమారుతీనగర్, ఫణిగిరి కాలనీ, భవానినగర్ ప్రాంతాల్లో శుక్రవారం రెవెన్యూ అధికారులు ఇండ్లకు రెడ్ మార్క్ వేసేందుకు రావటంతో రెండో రోజూ ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్, వనస్థలిపురం సబ్ డివిజన్‌ల పోలీసుల బందోబస్తుతో అయిదు టీంలుగా ఏర్పడిన రెవెన్యూ అధికారులు మూసీ పరీవాహక బస్తీలలో ఇంటింటికీ తిరిగి సర్వే చేశారు. ఇంటి ఓనర్ల వివరాలు సేకరించటంతో పాటు ఇక్కడ ఖాళీ చేసి డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వెళ్లేందుకు అంగీకారం ఉందా లేదా అనే సమాచారం సేకరించారు. స్థానికుల అభ్యంతరాలు, నిరసనల మధ్య అధికారులు ఇళ్ల గోడలపై రెడ్ మార్కింగ్‌లు చేశారు.

చైతన్యపురిలో పర్యటించిన ఎంపీ ఈటల రాజేందర్

కొత్తపేట, చైతన్యపురి ప్రాంత మూసీ సమీపంలోని కాలనీలలో మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ బీజేపీ కార్పొరేటర్లతో కలిసి పర్యటించారు. ప్రాణం పోయినా తాము ఇళ్లు వదిలి వెళ్లేది లేదని తమను ఆదుకోవాలని పేదలు ఎంపీకి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం రెవెన్యూ అధికారుల తీరుకు నిరసనగా ఎండలో నడిరోడ్డుపై బైటాయించి బాధితులు, నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. కలెక్టర్ లేక ఆర్‌డీఓ వచ్చే వరకు తాను లేచేదిలేదంటూ పోలీసులకు తెలిపారు. బీజేపీ పేదలకు అండగా ఉంటామని, పేదల ఇండ్ల జోలికి వస్తే కబడ్దార్ అని ఈటల అధికారులను హెచ్చరించారు. ధర్నాకు మద్దతుగా నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి, కార్పొరేటర్లు రంగా నర్సింహ గుప్తా, ప్రేమ్ మహేశ్వర్ రెడ్డా, కొప్పుల నర్సింహారెడ్డి, పవన్‌కుమార్, నవజీవన్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.


చైతన్యపురి వినాయకనగర్‌లో సర్వే చేస్తున్న రెవన్యూ అధికారులు

కిరోసిన్ పోసుకున్న యువకుడు

చైతన్యపురి వినాయక్‌నగర్ కాలనీలో రెవెన్యూ అధికారుల తీరుకు ఆందోళన చెందిన మహేష్ అనే యువకుడు ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకునేందుకు ప్రయత్నించాడు. కష్టపడి కట్టుకున్న ఇండ్లను కూల్చే అధికారులకు ఎవరిచ్చారంటూ నినాదాలు చేస్తూ బాటిల్‌లోని కిరోసిన్ ఒంటిపై పోసుకోగా అక్కడే ఉన్న స్థానికులు, పోలీసులు అడ్డుకున్నారు. చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సమీపంలో నుంచి నీళ్లు తీసుకొచ్చి మహేష్ ఒంటిపై పోసి కాపాడారు.

భర్త చనిపోయాడు....ఇల్లే ఆధారం..



భర్త నవీన్‌కుమార్ ఆరు నెలల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. ఇద్దరు ఆడపిల్లల ను పెట్టుకుని జీవనం గడుపుతున్నా. 20 స ంవత్సరాల క్రితం స్థలం కొనుగోలు చేసి ఇ ల్లు కట్టుకున్నాం. 2008లో రిజిస్ట్రేషన్ కూడా అయింది. ఇప్పుడు ఖాళీ చేయమంటే ఎలా..? ఈ ఇల్లే నాకు, నా పిల్లలకు ఆధారం . చావనైనా చస్తాం కానీ ఇళ్లు వదిలిపెట్టం.
–మద్దెల మాధవి, వినాయకనగర్ కాలనీ, చైతన్యపురి

విషం ఇచ్చి చంపేయండి..



కష్టపడి ఇల్లు కట్టుకున్నాం. ఇప్పుడు ఇల్లు ఖాళీ చేసి డబుల్ బెడ్‌రూం ఇస్తాం వెళ్లండి అంటున్నారు. రిజిస్ట్రేషన్ వుంది, కరెంటు, వాటర్ బిల్లు కడుతున్నాం. తమను వెళ్లిపొమ్మనటం న్యాయం కాదు. ప్రజలకు మేలు చేస్తారని గెలిపిస్తే తమకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. తమకు చావొక్కటే మార్గం. అందరికి విషం ఇచ్చి చంపేయండి.
–నవీన్, వినాయక్‌నగర్ కాలనీ, చైతన్యపురి

మరో మహిళ తమ ఇల్లు కూడా పోతుందని కలత చెంది, అక్కడ ఉన్న పరిస్థితులకు భయభ్రాంతులకు గురై కళ్లుతిరిగి కిందపడి పోయింది. ఆమెను స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

భార్యకు భరణం చెల్లించనందుకు...

భర్తకు నెల రోజుల జైలు

రంగారెడ్డి కోర్టులు: భార్య, ఇద్దరు ఆడ పిల్లల పోషణార్థం భర్త నెలకు రూ. 30 వేల రూపాయలు చెల్లించాల్సిందిగా రంగారెడ్డి జిల్లా ప్రధాన ఫ్యామిలీ కోర్టు భర్త జోగు కిరణ్‌ను ఆదేశించింది. కోర్టు ఆదేశించిన మొత్తాన్ని కిరణ్ 2021వ సంవత్సరం నుంచి చెల్లించాల్సి ఉండగా, ఆదేశాలను అనుసరించకపోవడంతో భార్య దాఖలు చేసిన పిటిషన్‌తో ఏకీభవిస్తూ కోర్టు భర్తకు నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. 2011లో కిరణ్‌కు వివాహం జరిగగా, వారికి ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. పిల్లలు పుట్టాక భార్యాభర్తల మధ్య సయోధ్య కుదరకపోవడంతో కోర్టు మెట్లు ఎక్కారు. ఇదే విషయమై భార్య, ఇద్దరు ఆడపిల్లల పోషణార్థం కోర్టు ఆదేశాలను బేఖాతర్ చేసిన కిరణ్‌కు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు అదృశ్యం

నాగోలు: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన మహిళ కనిపించకుండపోయిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం... బండ్లగూడ ఆనంద్‌నగర్ నివాసంలో ఉండే ఇరుగు రమాదేవి (21) గత సంవత్సరం నుంచి భర్తతో గొడవ పడి కుటుంబసభ్యులతో నివాసం ఉంటుంది. కాగా రమాదేవి మలక్‌పేట్ డీమార్ట్‌లో పనిచేయగా ఇటీవలే మానేసి ఇంటి దగ్గరే ఉంటుంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మలక్‌పేట డీమార్ట్ వద్ద ఉన్న బ్యూటీ పార్లర్ వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు రమాదేవి సెల్‌ఫోన్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో చుట్టుపక్కల, ఇతర ప్రాంతాలలో వెతికినా ప్రయోజనంలో లేకపోవడంతో శుక్రవారం ఆమె తండ్రి సుధాకర్ నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైదాబాద్‌లో..



సైదాబాద్: వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు కనిపించకుండా పోయారు. సైదాబాద్ పోలీసుల సమాచారం మేరకు... శంకేశ్వరబజార్‌లోని గోల్డేజ్ హోంలో ఆశ్రయం పొందుతున్న పీవీఆర్ నాగేశ్వర ప్రసాద్(60) బుధవారం ఉదయం వాకింగ్ అని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా అతని ఆచూకీ లభించనందున సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సింగరేణి కాలనీలో..



మెదక్ జిల్లా మాచిరెడ్డిపల్లెకు చెందిన కె.వెంకటేశం(45) ఈ నెల 14న సింగరేణి కాలనీలో నివసించే సోదరి కళావతి ఇంటికి వచ్చాడు. మరుసటి రోజు ఆరోగ్య సమస్యలతో ఉన్న అతడిని కళావతి ఇంటి బయట కూర్చోబెట్టి లోపలికి వెళ్లింది. ఆమె తిరిగి వచ్చి చూసేసరికి వెంటేశం కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు రెండు కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ సుజాతనాయక్


సమస్యల గురించి అడిగి తెలుసుకుంటున్న సుజాతనాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని అగ్రికల్చర్ కాలనీలో అధికారులతో కలిసి పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కార్పొరేటర్ సుజాతనాయక్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతనాయక్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని నూతన కాలనీలలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని, అందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను సత్వరమే పరిష్కరించాలని అందుకు జలమండలి అధికారులు డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా పొంగిపొర్లుతున్న డ్రైనేజీలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని అన్నారు. హైదరాబాద్ వాటర్‌వర్క్స్ జనరల్ మేనేజర్ బలరామరాజు, మేనేజర్ సురేష్, జీహెచ్ఎంసీ ఏఈ మల్లికార్జున్‌గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, అగ్రికల్చర్ కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి, కాలనీ ప్రతినిధులు జితేందర్‌రెడ్డి,రాము, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, స్థానికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వేగంగా పనులు పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం కాలనీ వాసులు, అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు నిల్వకుండా లెవల్స్ చూసుకొని భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఆశలత, డీఈ దామోదర్‌రెడ్డి, ఏఈ నరేందర్, నాయకులు దామోదర్‌రెడ్డి, రంగారెడ్డి, రవీంధర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ విజేతలకు పతకాల ప్రదానం



విజేతలకు పతకాలను అందజేస్తున్న డాక్టర్ చిరంజీవి

మలక్‌పేట: హైదరాబాద్ జిల్లా జూనియర్ కాలేజ్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–19 బాలబాలికల టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. నారాయణ గూడ వైఎంసీఏ అకాడమీలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ పిన్సిపాల్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చిరంజీవి చేతుల మీదుగా విజేతలకు పతకాలు, సర్టిఫికెట్స్ అందజేసినట్లు ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, మలక్‌పేట బాలుర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.జక్కయ్య తెలిపారు. కార్యక్రమంలో వైఎంసీఏ మాజీ జనరల్ సెక్రటరీ డాక్టర్ వినయ్ స్వరూప్, టీజీజేసీపీడీఏ ప్రెసిడెంట్ డాక్టర్ పి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి సౌత్ ఎండ్ పార్కు కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు శుక్రవారం సమావేశమై నూతన కమిటీకి ఎన్నికలు నిర్వహించుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా ఎం. రమేష్ విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా టి. రవికుమార్, ఉపాధ్యక్షులుగా ఎంవీఎస్ మూర్తి, కోశాధికారిగా ఈ. రామకృష్ణ, సహాయ కోశాధికారిగా సుధాకర్, జాయింట్ సెక్రటరీగా రాజేష్, కార్యవర్గ సభ్యులుగా హరిప్రసాద్, జగన్మోహన్‌రావు, కృష్ణారావు, లక్ష్మినారాయణ, లక్ష్మయ్య, మమత, మురళీ, ప్రమీల, సుబ్రమణ్యం, రమేష్, రామ్మోహన్‌లు విజయం ఎన్నికల్లో విజయం సాధించినట్లు నూతన అధ్యక్షుడు రమేష్ తెలిపారు.

మూసీ పరీవాహక ప్రాంతవాసులకు అండగా ఉంటా

మలక్‌పేట ఎమ్మెల్యే బలాల



చాదర్‌ఘాట్: మూసీ పరీవాహక ప్రాంతవాసులకు అండగా ఉంటానని మలక్‌పేట ఎమ్మెల్యే బలాల అన్నారు. శుక్రవారం ఆయన అజంపురా, ఓల్డ్‌మలక్‌పేటలోని మూసీ నది పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. బస్తీవాసులతో సమావేశమయ్యారు. రెవెన్యూ అధికారులు గురువారం వచ్చి బఫర్‌జోన్ మార్కింగ్ చేయడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎవరూ ఆందోళన చెందవద్దని అన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలకు కచ్చితంగా సహాయం చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. అజంపురా కార్పొరేటర్ అబ్రార్, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

యువకుడి ఇంటి ఎదుట నిరసన తెలిపిన యువతి

హస్తినాపురం: పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి మోసం చేసిన యువకుడి ఇంటి ఎదుట యువతి ఆమె బంధువులు నిరసన వ్యక్తం చేసిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వనస్థలిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాహెబ్‌నగర్ మహాలక్ష్మినగర్ కాలనీకి చెందిన సబావత్ నందకుమార్ (28) ఓ యువతిని చేసుకుంటానని నమ్మించి మరో యువతిని పెళ్లి చేసుకోవటానికి సిద్ధపడ్డాడు. విషయం తెలుసుకున్న బాధిత యువతి ఆమె కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం నందకుమార్ ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేసింది. దీంతో స్థానికులు 100కు డయల్ చేయడంతో సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని యువతి ఆమె బంధువులకు నచ్చజెప్పి వారిని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ తీసుకవచ్చారు. అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు నందకుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇన్‌స్పెక్టర్‌కు వినతి

వనస్థలిపురం: వనస్థలిపురం రైతుబజారు సమీపంలో ఉన్న వీరశైవ మత గురువు బసవేశ్వర విగ్రహం వద్ద ఉన్న మాంసపు దుకాణాన్ని తొలగించాలని కోరుతూ వీరశైవ సమాజం వనస్థలిపురం ఆధ్వర్యంలో శుక్రవారం వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వీరశైవ సమాజం వనస్థలిపురం అధ్యక్షుడు కరిణె శాంతప్ప మాట్లాడుతూ వీరశైవలు మాంసాహారులు కారని, బసవేశ్వరుని విగ్రహం వద్ద మాంసం దుకాణం ఉండడంతో వీరశైవుల మనోభావాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. తక్షణమే మాంసపు దుకాణం తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.